క్లుప్తంగా

సీజ్ చేసిన వాహనాలకు 3న వేలం

నకరికల్లు: నాటుసారా, మద్యం కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాలకు నవంబర్ 3వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్ఐ ఏ బాల కృష్ణ మంగళవారం తెలిపారు. బజాజ్ డిస్కవర్ వాహనం రూ.6వేలకు, ఆటో రూ.15వేలకు, హెచ్ఎఫ్ డీలక్స్ రూ.2500, బజాజ్ ప్లాటినా రూ.2500, పల్సర్ రూ.4 వేలు, స్కూటీ రూ.10వేలు, హీరోహోండా ప్యాషన్ ప్లస్ రూ.2500, ఆటో రూ.3500లుగా ధర నిర్ణయించినట్లు తెలిపారు. వాహనాల స్థితి పోలీసుస్టేషన్ ఆవరణలో ముందుగా పరిశీలించుకోవచ్చని అన్నారు. ఆసక్తి గల వారు వేలం అధికారి వద్ద ముందుగా రూ.2వేలు డిపాజిట్ చేయాలన్నారు. వేలంలో గెలుపొందిన వారు వివరాలకు స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యా సామర్థ్య సర్వే పరీక్షపై సమావేశం

ముప్పాళ్ల: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో విద్యా సామర్థ్య సర్వే పరీక్షపై పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ ఒంగోలు రాజు మంగళవారం సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా నవంబర్ 3వ తేదీన నిర్వహించే ఈ పరీక్షలో మూడవ, ఆరవ, తొమ్మిది తరగతుల విద్యార్థులు పాల్గొనాల్సి ఉంటుందన్నారు. మూడవ తరగతి విద్యార్థులు 60 నిమిషాలు, ఆరవ తరగతికి 75 నిమిషాలు, తొమ్మిదవ తరగతి వారు 90 నిమిషాలు పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఇంగ్లీషు/తెలుగు సబ్జెక్ట్ సిలబస్‌పై ప్రశ్నలు ఉంటాయన్నారు. విద్యార్థులను పరీక్షకు సన్నద్ధం చేయాలన్నారు. మోడల్ పరీక్ష నిర్వహించి సిద్ధం చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలన్నారు.

నీటి సౌకర్యం ఉంటేనే మొక్కజొన్న సాగు చేయాలి

నకరికల్లు: ఆరుతడులకు సరిపడ నీటి సౌకర్యం ఉన్న భూములలో మాత్రమే మొక్కజొన్న సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. మంగళవారం చీమలమర్రి, నకరికల్లు తదితర గ్రామాలలో మొక్కజొన్న రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న విత్తనాలు రైతులు అధీకృత డీలర్ వద్దే కొనుగోలు చేయాలన్నారు. అలాగే సంతకాలతో కూడిన రసీదును తీసుకోవాలన్నారు. చీమలమర్రి గ్రామంలో విత్తనాలు నాణ్యతలేక రైతు నష్టపోయాడన్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. సదరు రైతుతో మాట్లాడి వాస్తవాన్ని సేకరించామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామా వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సమస్యలకు చెక్



రాజుపాలెం: మండలంలోని బలిజేపల్లి, కొత్తూరు గ్రామాల సరిహద్దుల్లో 11 కేబుల్ ఇన్‌లైన్ పోల్ వర్క్ గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఏఈ వీవీ ప్రసాద్ మంగళవారం తెలిపారు. గతంలో పోల్‌కు పోల్‌కు మధ్య ఎక్కువ దూరం ఉండడం వల్ల వైర్లు తెగి పడడం, వ్యవసాయం నిమిత్తం విద్యుత్ వాడకం ఎక్కువ అవ్వడంతో కండెన్సర్లు మాడిపోతున్నాయని తెలిపారు. దీనికి గాను సుమారు 15 కొత్త పోల్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఏఈ తెలిపారు. ఇక నుంచి విద్యుత్ సమస్యలు రావని తెలిపారు. ఇదే విధంగా దూరం ఉన్న ప్రతీ చోట కొత్త పోల్స్ ఏర్పాటు చేస్తామని ఏఈ తెలిపారు. ఏఈతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఏడుగురు విద్యార్థుల ఎంపిక



రాజుపాలెం: గణపవరం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఏడుగురు విద్యార్థులు యోగా జిమ్నాస్టిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు ఎంపికైనట్లు ఎంఈవో మల్లిఖార్జునశర్మ మంగళవారం తెలిపారు. ఈ పోటీలు కాకినాడలో నవంబర్ 1వ తేదీ నుంచి జరుగుతున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ఎస్‌కే షకీలా (6వ తరగతి), పి.మహిమకుమారి (7వ తరగతి), సంతోష(8వ తరగతి), ఎస్‌కే హర్ప్రియా (9వ తరగతి), కె.యజ్ఞశ్రీ (9వ తరగతి), రమ్య (9వ తరగతి), జి.మేఘశ్రీలక్ష్మీ (9వ తరగతి)లు పాల్గొననున్నట్లు హెచ్ఎం సుగుణమ్మ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఎస్ఈబీ సిబ్బంది నూజెండ్ల మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఈ దాడుల్లో నూజెండ్ల మండలం టి. అన్నవారం గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని అందులోని 4 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. ట్రాక్టర్‌ను, డ్రైవర్ పి.కోటేశ్వరరావును అదుపులోకి తీసుకొని ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్. విజయ భాస్కర్‌రావు, సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

గతం కంటే ఎక్కువ మెజార్టీ రావాలి

తాళ్లచెరువు గ్రామస్తులకు సూచించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



తాళ్లచెరువు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువు గ్రామంలో 2019 ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి 1800లకు పైగా మెజార్టీ ఇచ్చారు. ఇచ్చిన హామీలన్నింటినీ నిలబెట్టుకున్నాం. అర్హతనుబట్టి ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించాం. పెన్షన్లు పంపిణీ చేశాం. ఇళ్ల స్థలాలు ఇచ్చాం. గత ఎన్నికల కంటే ఈసారి ఇంకా ఎక్కువ మెజార్టీ వచ్చే విధంగా అందరూ కృషిచేసి మరొక్కసారి పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జండా ఎగురవేయాలని, జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎంగా కొనసాగించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్య నాయకులకు సూచించారు. మండలంలోని తాళ్లచెరువులో సోమవారం రాత్రి ఆయన ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. గ్రామస్తుల ఇళ్లకు వెళ్లి ఆప్యాయంగా పలుకరించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేసిన అభివృద్ధి పనులపై చర్చించారు. గత ఎన్నికల్లో గ్రామంలో మొత్తం 3200 మంది ఓటర్లు ఉండగా వైఎస్సార్ సీపీకి 1800పైగా మెజార్టీ ఇచ్చారన్నారు. టీడీపీ వారికి సైతం సంక్షేమ పథకాలు అందచేశామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలందరికీ మేలు జరిగిందని, ఈ సారి వారి ఓట్లు కూడా మనకు వచ్చేలా కృషి చేయాలన్నారు. చేసిన మేలును వివరించి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, సొసైటీ మాజీ చైర్మన్ రామిశెట్టి చిన్నయల్లమందయ్య, గ్రామ ప్రముఖులు సర్పంచ్ కిక్కురు అర్లారెడ్డి, ఎంపీటీసీ గోపు అంతోనిరెడ్డి, మాజీ సర్పంచ్ తుమ్మా చిన్నపరెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ బాలశౌరెడ్డి, దొండేటి పాపిరెడ్డి, నెక్కంటి శౌరెడ్డి, దొండేటి బాలిరెడ్డి, రాయపరెడ్డి, తుమ్మా జోసఫ్‌రెడ్డి, ఉడుముల స్లీవారెడ్డి, ఏరువ వెళాంగిణిరెడ్డి, అల్లం అంతోనిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలు సమర్థంగా అమలు చేయండి

- సత్తెనపల్లి ఎంపీపీ యలవర్తిపాటి షేక్ జైబూన్‌బీ
- ప్రశాంతంగా మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీపీ జైబూన్‌బీ, బాబురావు, విజయభాస్కరరెడ్డి

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అధికారులు అమలుచేయాలని సత్తెనపల్లి ఎంపీపీ యలవర్తిపాటి షేక్ జైబూన్‌బీ అన్నారు. సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎంపీపీ జైబూన్ బీ మాట్లాడుతూ చలికాలంలో డెంగీ వ్యాధి ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది, పంచాయతీ అధికారులు తగు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మండలంలో పూర్తి స్థాయిలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. మండలంలో 18 ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించినట్టు వెల్లడించారు.రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఈ-క్రాప్ బుకింగ్‌ను గ్రామాల్లో వ్యవసాయ అధికారులు విజయవంతంగా పూర్తిచేశారని ప్రశంసించారు. మిరప పంట రైతులు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం వినియోగించుకోవాలని సూచించారు. పాడిరైతులు 1962కి ఫోన్ చేసి ఉచితంగా సంచార పశు వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఎంపీడీవో జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల సామాజిక తనిఖీ జరుగుతోందని వెల్లడించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో అవకాశం ఉన్న చోట రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల ద్వారా వర్షపు నీటి సంరక్షణ చేపట్టాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణాలను చేపట్టాలని కోరారు. ఫామ్ పాండ్స్ ద్వారా నీటి నిలువ చర్యలు తీసుకోవాలని కోరారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమం గ్రామాల్లో పాడి రైతులకు బాగా లాభసాటిగా మారిందని, ఇంకా విజయవంతం చేసేందుకు పాడి రైతులకు రుణాలు ఇప్పించేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్టు వివరించారు. జగనన్న హౌసింగ్ లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పంచాయతీరాజ్ విస్తరణ అధికారి దయాసాగర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా అధికారులు ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు సఫలీకృతం అవుతున్నట్టు చెప్పారు. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తమ శాఖల యొక్క నివేదికలను చదివి వినిపించారు. ముందుగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం



పట్టణంలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



అమరేశ్వరాలయం వద్ద మానవహారం

బెల్లంకొండ: కుల మతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ కలసిమెలసి ఐక్యంగా ఉండాలని బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పల్ ఉమాదేవి తెలిపారు. మంగళవారం కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్స్‌పల్ మాట్లాడుతూ మన దేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, ప్రతీ ఒక్కరూ కులమతాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలన్నారు. భావిభారత పౌరులైన విద్యార్థులు ఐక్యంగా ఉండాలని, ఐక్యతతో ఏదైనా సాధించవచ్చని తెలిపారు. ఐక్యతకు ప్రతిరూపమైన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శారదా దేవి, లక్ష్మీ సులోచన, సాంబశివరావు, రమేష్‌బాబు, కుసుమ కుమారి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞాన రాజుపాల్ ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుక్క చంద్రపాల్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు గరీబీ హఠావో నినాదం ద్వారా పేదరిక నిర్మూలనకు ఎంతో కృషి చేశారన్నారు. బ్యాంకుల జాతీయకరణతో సామాన్య ప్రజలకు మేలు చేశారన్నారు. అలాగే సర్దార్ పటేల్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కొన్ని సంస్థానాలను విలీనం చేయటానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అదే విధంగా భారతదేశ ఐక్యత, సుస్థిరతకు పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త లక్ష్మయ్య, సీనియర్ నాయకులు షేక్ అజీమ్, షేక్ చాంద్ భాషా, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ షేక్ జలీల్, కోట ఆనంద్, సిద్దెల మోహన్ రావు, మంగలపూరి శంకరరావు, జెట్టి శేఖర్, గుజ్జర్లపూడి కన్నా, జిల్లెల్ల పాల్ రాజు తదితరులు ఉన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి

అమరావతి: సాహసోపేతమైన నిర్ణయాలతో దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చి భారత దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టిన సర్దార్ పటేల్ అందరికీ ఆదర్శప్రాయుడని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి అమరేశ్వరాలయం వరకు సర్దార్ పటేల్ జయంతి వేడుకలలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అమరేశ్వరాలయం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ దేశ విభజన అనంతరం దేశంలో పలు ప్రాంతాలలో చెలరేగిన అల్లర్లను అణచివేయటంలో, తొలిభారత ఉపప్రధానిగా ఆయన సమర్థవంతంగా, సాహసోపేతంగా వ్యవహరించారన్నారు. అలాగే భారతదేశ అభివృద్ధికి ఆయన కృషి ఎనలేనిదన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశభక్తిని అలవరుచుకోవాలన్నారు. తొలుత ఎంపీడీవో కార్యాలయంలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు స్థానిక శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాజేటి రాము, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అట్లతద్దె పండుగ వేడుకలు



అమరావతి: అట్లతద్ది పండుగ సందర్భంగా స్థానిక అమరేశ్వరాలయ సమీపంలో సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అట్లతద్ది పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు సతీమణి వైఎస్సార్‌సీపీ నాయకురాలు వసంత కుమారి పాల్గొని తొలుత గో పూజ నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఊయల ఊగుతూ మహిళలను ఉత్సాహ పరిచారు. మహిళలతో పాటు కోలాటం ఆటపాటలలో పాల్గొన్నారు. మహిళలకు అట్లు, ప్రసాదాలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ కరుణకుమారి, ఎంపీడీవో ఉమాదేవిలతో పాటు ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

3న రైతులతో సమావేశం

ముప్పాళ్ల: కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారి(169ఏజీ) నిర్మాణంలో భూములు కోల్పోతున్న మాదల, ఇరుకుపాలెం పరిధిలోని రైతులతో నవంబర్ 3వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని తహసీల్దార్ ఎమ్.భవాని శంకర్ మంగళవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి సంబంధిత రైతులు, వారి ప్రతినిధులు, ఇతర ఆసక్తిగల వ్యక్తులు, లీగల్ ప్రతినిధులు హాజరు కావచ్చన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆయా రైతులతో చర్చలు జరుపుతారన్నారు. సమావేశానికి హాజరయ్యే రైతులు భూములకు సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంట్లు వాటి జిరాక్స్, పట్టాదారు పాసుపుస్తకం , టైటిల్‌డీడ్, అందుబాటులో ఉన్న ధ్రువపత్రాలు, బ్యాంక్ ఖాతా వివరాలు, వారి భూమిపై ఉన్న చెట్లు, కట్టడాలు, ఇతర నిర్మాణాలు, వాటి ప్లాన్ మరియు పన్ను రశీదులు తీసుకొని హాజరుకావాలన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



ఏఐటీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం



పట్టణంలో పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న కంభాల శ్రీనివాస్

పెదకూరపాడు:పెదకూరపాడు హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక పౌరసరఫరాల గోడౌన్ వద్ద మంగళవారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రజా నాట్యమండలి జిల్లాకార్యదర్శి రామకృష్ణ పాల్గొని ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా తమ హక్కులను రాజ్యాంగానికి లోబడి సాధించుకోవటానికి ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. మండల ఏఐటీయూసీ అధ్యక్షులు తేల ప్రసాద్ నియోజవర్గ సీపీఐ కార్యదర్శి మున గోటి శ్రీనివాసరావు, శేఖర్, పురుషోత్తమరావు, ఏడుకొండలు, సుధాకర్, రాజారత్నం పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను పరిరక్షించాలి

సత్తెనపల్లి: కార్మిక హక్కుల పరిరక్షణకు నడుం బిగించేందుకు ప్రతి ఒక్కరూ కదలిరావాలని ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గం అధ్యక్షులు కంభాల శ్రీనివాస్ అన్నారు. ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలోని అమరావతి బస్టాప్ వద్ద మంగళవారం జరిగిన ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న ముంబై నగరంలో ఆవిర్భవించి దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం, ప్రజలందరికీ స్వేచ్ఛ సమానత్వంతో పాటు కార్మికవర్గ హక్కుల పరిరక్షణ ఆశయంగా 1920 నుంచి భారత దేశంలో పనిచేయడం ప్రారంభించిందన్నారు. ఒకవైపు నికృష్టమైన పని పరిస్థితుల నుంచి, అర్ధాకలి, అణిచివేతల నుంచి కార్మిక వర్గాన్ని విముక్తి చేస్తూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఏఐటీయూసీ కీలకపాత్ర పోషించిందన్నారు. ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు నరిశేటి వేణుగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు డీఆర్ మస్తాన్, ఏపీ ఆర్టీసీ హయర్ బస్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఈసీ రెడ్డి అంజిరెడ్డి. పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.శంకరరావు, ఏఐటీయూసీ నాయకులు పి.యిర్మీయా, పి.శంకర్, కోటేశ్వరరావు, అమరావతి కోటిలింగం, జానీ, సూరి, దానయ్య, జైపాల్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కంబాల ఆనంద్ పాల్గొన్నారు.

నవంబర్ 15న విజయవాడలో ప్రజారక్షణ భేరి



నకరికల్లులో బైక్ ప్రచారం

నకరికల్లు: నవంబర్ 15న సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణభేరీ విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, శివకుమారిలు కోరారు. ఈ మేరకు నకరికల్లులో మంగళవారం బైక్ ప్రచార ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 15న విజయవాడలో ప్రజారక్షణభేరీ పేరిట భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభకు జాతీయ నాయకులు సీతారాం ఏచూరి హాజరవుతారని అన్నిగ్రామాల నుంచి భారీగా తరలిరావాలని కోరారు. పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న బస్సుయాత్ర త్వరలో సత్తెనపల్లి చేరుకుంటుందని అందరూ సత్తెనపల్లి బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. అనంతరం నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకురాలు శివకుమారి, నాయకులు జి.పిచ్చారావు, ఈవూరి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అందరికీ అవకాశం ఇవ్వండి

మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ





సమావేశంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు

సత్తెనపల్లి: ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశం అందరికీ ఇవ్వాలని మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. 31వ వార్డు కౌన్సిలర్ తురక మేరీ గ్రేస్ మాట్లాడుతూ పట్టణంలో వీధిదీపాల నిర్వహణకు గత సంవత్సరం రూ.10 లక్షలు కేటాయించారని జూన్ వరకు అవకాశం ఉండగా ప్రస్తుతం మరలా వీధి దీపాల నిర్వహణ నిమిత్తం అజెండాలో పెట్టారని ప్రశ్నించారు. కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ గతంలో నిర్వహణ మొత్తం ఈఈఎస్ఎల్ చూసేదని అప్పట్లో కావలసిన పరికరాలను అందించేవారన్నారు. కానీ మార్చి నుంచి మున్సిపాలిటీనే ప్రత్యేకంగా చేపడుతుందన్నారు. రైల్వే స్టేషన్ రోడ్‌లోని మీసేవ ఎదుట ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ ప్రమాదకరంగా ఉందని ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలన్నారు. గుంటూరు-మాచర్ల ప్రధాన రహదారిలో ఒక షాపు ముందు రోడ్డు, షాప్‌కు మధ్యలో ఫ్లోరింగ్ చేశారని దాని వలన తోపుడుబండ్ల వ్యాపారులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ చెరువుకు మంచి నీటిని నింపేందుకు ఎన్ని మోటార్లు పెట్టారు, పైపులైన్ ఎంత వేశారని ప్రశ్నించారు. కమిషనర్ షమ్మి మాట్లాడుతూ గతంలో రోజు మార్చి రోజు మంచినీటి సరఫరా జరిగేదని, చివరకు చెరువు నీరు డెడ్ స్టోరేజ్‌కి దిగిపోయి కేవలం 200 ఎంఎల్‌డీ మాత్రమే ఉండడంతో రెండు రోజులకు ఒకసారి సరఫరా చేయడం జరిగిందన్నారు. మంచినీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవతో అక్టోబర్ 17వ తేదీన నాగార్జున సాగర్ కుడి కాలువకు నీటి సరఫరాను విడుదల చేయడంతో మంచినీటి చెరువులను నింపుకునేందుకు అవకాశం కలిగిందన్నారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన 15 మోటార్లు, 300 మీటర్లు హెచ్‌డీపీఈ పైప్‌లైన్లు ఏర్పాటు చేసి 19వ తేదీ వరకు 1900 ఎంఎల్‌డీ నీటిని నింపామన్నారు. చెరువుకు నింపిన నీరు పట్టణ ప్రజలకు రోజు మార్చి రోజు సరఫరా చేస్తే జనవరి వరకు వస్తాయని, అనంతరం మళ్లీ చెరువులు నింపుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దూరదృష్టితో వేగవంతంగా చెరువును నింప గలిగామని లేకపోతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలంటే నెలకు రూ.10 లక్షల పైబడి ఖర్చయ్యేదన్నారు. ఇటు ప్రజాప్రతినిధులు, అటు యంత్రాంగం మంచినీటి చెరువు నింపే విషయంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ పార్క్, డివైడర్‌కు సంబంధించి నిర్వహణ కాంట్రాక్టర్‌కు ఇచ్చినప్పటికీ కార్మికుల చేత పనిచేయించటం ఏమిటని ప్రశ్నించారు. కమిషనర్ మాట్లాడుతూ డివైడర్ నిర్వహణ పనుల విషయంలో గ్యాంగ్‌వర్క్ చేయించడం సాధారణమేనన్నారు. 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యకలాపాల సమయంలో కార్మికులను ఉపయోగించుకోవడం అతిపెద్ద తప్పిదం కాదన్నారు. 7వ వార్డు కౌన్సిలర్ సుమన్ కుమార్ మాట్లాడుతూ గతంలో పట్టణంలో ఆస్తిపన్ను వసూలు చేసి రూ.3.50 లక్షలు కాజేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై పోలీస్ స్టేషన్‌లో ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ ఆర్డీకి ఫిర్యాదు చేశామని ఉద్యోగి నుంచి నగదు రికవరీ చేసి తొలగించామన్నారు. ఆర్డీ ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయనున్నామన్నారు. దీనిలో ఇంకా ఎవరి పాత్ర అయినా ఉన్నట్టు తేలితే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు తమ వార్డులో 14వ ఆర్థిక సంఘం నిధులతో శ్మశాన వాటికలో గ్రావెల్ రోడ్డు గతంలో పెట్టారని త్వరితగతిన ఆ పని చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ అజెండాలోని 16వ అంశం మినహా మిగిలిన అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్లు ప్రకటించగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు పాల్గొన్నారు.

సంతాన సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేష పూజలు



పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో వేంచేసియున్న సంతాన సుబ్రహ్మణ్యే శ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజా కా ర్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



పిడుగురాళ్ల: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని ప్రజాశక్తి నగర్ రైల్వే బ్రిడ్జి డౌన్‌లో మంగళవారం జరిగింది. ఘటనకు సంబంధించి రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు విశాఖపట్నం నుంచి లింగంపల్లి వెళ్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో పిడుగురాళ్ల ప్రజాశక్తి నగర్ వద్ద రైల్వే బ్రిడ్జి కింద ట్రాక్ దాటుతున్న వ్యక్తిని ఢీకొంది. వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగు లుంగి, గీతలు ఉన్న తెల్లచొక్కా ధరించి ఉన్నాడు. మృతుని ఛాతిపై మరియమ్మ అని తెలుగు అక్షరాలతో పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభు త్వ వైద్యశాలకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే ఎస్ఐ 9440438256, రైల్వే కానిస్టేబుల్ సునిల్ 94403098592 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

చెకుముకి పోటీల పోస్టర్ల ఆవిష్కరణ

వినుకొండ టౌన్: చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా ప్రతిభా పరీక్షలను 2023 నవంబర్ 10న నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు అప్పరాజు నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్ఎస్‌పీ జిల్లా పరిషత్ పాఠశాల నందు చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జనవిజ్ఞాన వేదిక వినుకొండ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గడిచిన 30 సంవత్సరాలుగా 8, 9, 10 విద్యార్థులకు చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనే విధంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తూ, ఎంత మంది విద్యార్థులు హాజరవుతారో తెలియచేయాలన్నారు. పాల్గొనే విద్యార్థుల వివరాలను నవంబర్ 5వ తారీకులోపు అందచేయాలని పట్టణ జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు కమలారామ్ కోరారు. కార్యక్రమంలో సభ్యులు రవికుమార్, యూత్ కార్యదర్శి రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు గోవింద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

సత్తెనపల్లి: ఎన్నికల కమిషన్, పల్నాడు జిల్లా కలెక్టర్, పల్నాడు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం రెవెన్యూ డివిజనల్ అధికారి, ఓటర్ల నమోదు అధికారి బీఎల్ఎస్ రాజకుమారి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా అక్టోబర్ 27న ప్రచురించబడిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, సూచనలు కోరారు. నియోజకవర్గ స్థాయిలో గతంలో ఫైనల్ పబ్లికేషన్ నుంచి ఇప్పటి వరకు చేర్చబడిన, తొలగింపబడిన, సవరించబడిన ఓటర్ల వివరాలు తెలియజేశారు. జీరో డోర్ నంబర్లు, పది కన్నా ఎక్కువ ఓటర్లు కలిగిన డోర్ నంబర్లు, 100 సంవత్సరాల పైబడిన ఓటర్ల వివరాలు, సవరణకు తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఏఈఆర్వోలు, గుర్తింపు పొందిన అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులు ఉన్నారు.